

మేకెదాటుకు సుప్రీం అభయం

- మేకెదాటు ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.9వేల కోట్లు
- ప్రాజెక్టు ఎత్తు 441.2 మీటర్లు - నీటి సేకరణ 66.5 టీఎంసీలు
- డెడ్ స్టోరేజ్ 7.7 టీఎంసీలు - విద్యుత్ ఉత్పత్తి 440 మెగావాట్లు

● తమిళనాడు పిటీషన్లు కొట్టేయడంతో అడ్డంకులు తొలగినట్లే ● ఇక బెంగళూరుకు శాశ్వత తాగునీరు
● రామనగర జిల్లాలో సంబరాలు ● రూ.9వేల కోట్లతో ప్రాజెక్టు అంచనా.. 66.5 టీఎంసీల సామర్థ్యం

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మేకెదాటు ప్రాజెక్టుకోసం దశాబ్దాలుగా పోరాటాలు సాగుతున్న సంగతి తెలిసిందే. కర్ణాటక ప్రభుత్వం ఓ అడుగు ముందుకేస్తే తమిళనాడులోని ప్రభుత్వంతోపాటు అక్కడి రాజకీయ పార్టీలు అడ్డుకునేందుకు ఉండే అన్ని ఎత్తుగడలను ప్రయోగిస్తూనే ఉన్నారు. కానీ తమిళనాడు దాఖలు చేసుకున్న పిటిషన్లను సుప్రీంకోర్టు తిప్పికొట్టడంతో కర్ణాటకకు అభయమిచ్చినట్లయ్యింది. మేకెదాటు ప్రాజెక్టుతో బెంగళూరు వాసులకు శాశ్వతంగా తాగునీరు లభ్యం కానుంది. సుప్రీం చర్యలతో బెంగళూరు దక్షిణ (రామనగర) జిల్లా అంతటా సంబరం నెలకొంది. కావేరి నదికి అనుబంధంగా ఇప్పటికే నాలుగు ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో హేమావతి మినహా మిగిలిన కబిని, హారంగి, కేఆర్ఎస్ మైసూరు ప్రాంత జిల్లాలోనే ఉన్నాయి. ఏటా కావేరి నీరు తమిళనాడు కోటా ముగిసినా రాష్ట్రంలోని ప్రాజెక్టులనుంచి భారీగా నీరు వృథా అవుతోంది. తీవ్రమైన కరువు నెలకొంటే తప్ప కొడగు, కేరళలో భారీ వర్షాలు కురిస్తే కావేరినదికి అనుబంధమైన జలాశయాలు పోటెత్తుతాయి. ఇటీవల మూడేళ్లుగా సమృద్ధిగా వర్షాలు రావడంతో అన్ని ప్రాజెక్టులు వరుసగా నిండుతున్నాయి.



మేకెదాటు వద్ద కావేరి ప్రవాహం

సుప్రీం నిర్ణయంతో మళ్లీ జీవం

రామనగర జిల్లా కనకపుర తాలూకా మేకెదాటు వద్ద కావేరి నదికి అడ్డంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించేందుకు కర్ణాటక ప్రభుత్వం కొన్నేళ్లుగా ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన అభ్యంతర పిటిషన్లను సుప్రీంధర్మాసనం తిరస్కరించడంతో కర్ణాటకకు కలిసివచ్చినట్లయ్యింది. మేకెదాటు వద్ద ప్రాజెక్టు నిర్మించడం ద్వారా బెంగళూరుతోపాటు బెంగళూరు దక్షిణ జిల్లా రామనగర ప్రాంతానికి శాశ్వతంగా తాగునీరు సమకూర్చడంతోపాటు 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలని నిర్ణయించారు. సుప్రీంకోర్టు నిర్ణయంతో మరుగున పడిన మేకెదాటు ప్రాజెక్టుకు మళ్లీ పునర్జీవం వచ్చినట్లయ్యింది. మా నీరు-మా హక్కు అంటూ మేకెదాటు ప్రాజెక్టు కోసం భారీగా ర్యాలీ జరిపిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వ్యవధిలోనే మేకెదాటుకు భూమిపూజ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇదే ప్రాంతానికి చెందిన డీకే శివకుమార్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, జలవనరులశాఖ మంత్రిగా, డీసీఎంగా కొనసాగుతున్నందున ఆయనకు ఈ ప్రాజెక్టు ప్రతిష్ఠాత్మకం అవుతోంది. ప్రాజెక్టు పూర్తయితే బెంగళూరుకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం కానుంది. తద్వారా బెంగళూరుకు 4.75 టీఎంసీల నీటిని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. తమిళనాడువైపు వృథాగా వెళ్తున్న నీటిని ఉపయోగించుకున్నట్లు అవుతుంది. ప్రాజెక్టు ద్వారా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు అనుకూలంగా ఉంటుంది. ఇప్పటికే ప్రాజెక్టు స్థలాన్ని గుర్తించారు. ఏటా సముద్రం పాలవుతున్న నీటిని ప్రాజెక్టులో నిల్వ ఉంచుకుని విద్యుత్ ఉత్పత్తితో పాటు బయలుసీమ జిల్లాలతోపాటు బెంగళూరుకు తాగునీరు సమకూర్చుకోవడం దీని ప్రధాన ఉద్దేశం.

నీటితోపాటు విద్యుత్ ఉత్పత్తి సాధ్యం

ఈ ప్రాజెక్టు కావేరి ట్రిబ్యునల్ తీర్పులో కర్ణాటకకు కేటాయించిన నీటి పరిమితిలోపలే రూపొందించారు. ఒంటికూడ్లు అటవీప్రాంతంలో మేకెదాటు ప్రాజెక్టు నిర్మించాలని నిర్ణయించారు. ఇక్కడనుంచి సంగమ మూడు కిలోమీటర్ల దూరంలో ఉండగా, మేకెదాటు 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడ నుంచి 2 కిమీ దూరంలో తమిళనాడు సరిహద్దు రానుంది. మేకెదాటు ప్రాజెక్టు భూమట్టానికి 352 మీటర్లు నిండి ప్రవహించేటప్పుడు 440 మీటర్లు, అత్యంత గరిష్ఠంగా 441 మీటర్ల నీటి ప్రవాహాన్ని సేకరించే సామర్థ్యం ఉంది. ఈ డ్యాం 674 మీటర్ల పొడవు, 99 మీటర్ల ఎత్తుతో 17 గేట్లను కలిగి ఉంటుంది. ప్రస్తుత ప్రాజెక్టు ద్వారా కర్ణాటక 440 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సహకారం కానుంది.

వేలాది ఎకరాలకు ముంపు ముప్పు

మేకెదాటు జలాశయం నిర్మాణానికి వేలాది హెక్టార్ల అటవీప్రాంతం ముంపు కానుంది. అందుకు ప్రత్యామ్నాయంగా అంతే ప్రమాణంతో అడవిని విస్తరింపచేసేందుకు ఇప్పటికే కార్యాచరణ సాగుతోంది. బెంగళూరు దక్షిణ జిల్లా సంగమ, మేకెదాటు ప్రాంతంలో కావేరి నదికి అడ్డుగా నిర్మించే ఈ ప్రాజెక్టుకు రూ.9వేల కోట్లతో అంచనా వేశారు. జలాశయం కోసం 4,996 హెక్టార్ల ప్రదేశం ముంపు కానుంది. ఇందులో 4,716 హెక్టార్లు అటవీప్రదేశమే ఉంది. అందులోనూ 2800 హెకార్లు కావేరి అభయారణ్యానికి చెందింది. ముంపునకు గురయ్యే భూమిలో 95శాతం భూమి అటవీప్రాంతమే అయినందున ప్రాజెక్టుకు అనుమతులు లభించడం జాప్యమైంది. కనకపుర తాలూకాలో 2,500 హెక్టార్లు, మండ్య జిల్లా ముత్తత్తి అటవీప్రాంతం, చామరాజనగర హనూరు ఫారెస్టు డివిజన్‌తో కలిపి 2,200 హెక్టార్ల అడవి ముంపునకు గురి కానుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా బెంగళూరు దక్షిణ జిల్లాలో 2,500 హెక్టార్ల ప్రభుత్వ భూమిని జిల్లా యంత్రాంగం అటవీశాఖకు అప్పగించనుంది. ఇప్పటికే 30 ప్రదేశాలలో స్థలాలను గుర్తించారు. ప్రాజెక్టు పరిధికి అనుబంధమైన మండ్య, చామరాజనగర జిల్లాల్లోనూ ఇదే తరహాలోనే రెవెన్యూ శాఖ ముంపునకు గురయ్యేంతటి భూమిని ప్రత్యామ్నాయంగా అటవీశాఖకు కేటాయించాల్సి ఉంది. ఇలా పొందిన భూమిలో వన్యసంపదను పెంచే ప్రక్రియ అటవీశాఖ చేయనుంది. మండ్య జిల్లాలో 2వేలు, చామరాజనగర జిల్లా పరిధిలో వెయ్యి హెక్టార్ల భూమి అటవీశాఖకు లభించే అవకాశం ఉంది.

సర్వత్రా సంబరాలు

మేకెదాటు ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించడంతో బెంగళూరు దక్షిణ (రామనగర) జిల్లా అంతటా సంబరాలు చేసుకున్నారు. కర్ణాటక ప్రజలంతా సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతించారు. ప్రత్యేకించి బెంగళూరు, రామనగర, మండ్య, చామరాజనగర జిల్లాల్లో పలుచోట్ల సంబరాలు కొనసాగాయి. చన్నపట్టణలో కస్తూరి కర్ణాటక జనపరవేదిక కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తూ ర్యాలీ చేశారు. రామనగరలో కర్ణాటక రక్షణా వేదిక (స్వాభిమాన వర్గం) జిల్లా విభాగం ఐజూరు సర్కిల్‌లో బాణాసంచా కాల్చి స్వీట్లు పంచారు. తాగునీటి సమస్య తీరనుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఖర్గే నిర్ణయమే ఫైనల్

● నేడు ఢిల్లీకి మరోసారి సీఎం

● సర్కారులో మార్పులపైనే ఉత్కంఠ
● కీలక సమయంలో డీకే మౌనం
● విస్తరణ ఇప్పట్లో లేనట్లేనా..?



బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ విస్తరణకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. అంతటితోనే ముగిసిందనుకుంటే పొరపాటే. అసలుకథ ఇప్పటినుంచే ప్రారంభమవుతుంది. మరో మూడు రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తి అవుతుంది. ఇదే సందర్భంలోనే క్యాబినెట్ విస్తరణకు రాహుల్‌గాంధీ చెంతకు ఒంటరిగా వెళ్లి సీఎం సిద్దరామయ్య అనుమతులు పొందారు. కానీ క్యాబినెట్ విస్తరణ విషయంలో డీసీఎం డీకే శివకుమార్ సైలెన్స్‌గా మారిపోయారు. రాహుల్‌గాంధీని ఢిల్లీలో శనివారం సీఎం సిద్దరామయ్య ఒంటరిగా భేటీ అయ్యారు. క్యాబినెట్ విస్తరణకు అనుమతులు ఇస్తూనే ఖర్గేజీ, కేసీ వేణుగోపాల్‌తో చర్చించాలని సూచించారు. దీంతో అనివార్యమై సీఎం సిద్దరామయ్య సోమవారం ఢిల్లీలో అందుబాటులో ఉంటారు. కేవలం సీఎం సిద్దరామయ్య ఒక్కరి నిర్ణయంతోనే క్యాబినెట్ విస్తరణ అసాధ్యం. డీసీఎం డీకే శివకుమార్ కూడా తప్పనిసరిగా ఉండాలి. డీకే శివకుమార్ సోమవారం షెడ్యూల్ ఖరారు కాలేదు. సీఎం సిద్దరామయ్య నేరుగా డీకే శివకుమార్‌ను చర్చలకు ఆహ్వానిస్తారా లేదా అధిష్ఠానం నుంచే సూచిస్తారా.. అనేది తెలలేదు. రాష్ట్రంలో క్యాబినెట్ విస్తరణ జరగాలంటే సీఎం సిద్దరామయ్య జాబితాతోపాటు డీకే శివకుమార్ జాబితాకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. వీరిద్దరితో పాటు మల్లికార్జున ఖర్గే సూచించేపేర్లు పరిగణనలోకి తీసుకోవాలి. కర్ణాటక తరహా పరిస్థితి వేరే ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌కు ఉండదని చెప్పవచ్చు. మల్లికార్జున ఖర్గేది కర్ణాటక కావడంతో ఆయనను ఆశ్రయించేవారికి అవకాశాలు ప్రతి సందర్భంలోనూ లభిస్తున్నాయి. విస్తరణలో కూడా ఆయన వాటా ఉండదని చెప్పలేం.

● సీఎం, డీసీఎంలు సాధారణంగా ప్రతిరోజూ వారి షెడ్యూళ్లతోపాటు పాల్గొనే కార్యక్రమాలకు సంబంధించి ముందుగానే వివరాలు బహిరంగం చేస్తారు. కానీ ఆదివారం ఇద్దరికి సంబంధించిన షెడ్యూల్‌లు బహిరంగం కాలేదు. బెంగళూరులో జరుగుతున్న కృషి మేళా ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొనాల్సి ఉండేది. కానీ ఆయన అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి, రెవెన్యూశాఖ మంత్రి కృష్ణభైరేగౌడ మాత్రమే పాల్గొన్నారు. కానీ ముఖ్యమంత్రి సోమవారం ఉదయం 11గంటలకు హెచ్ఏఎల్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళతారు. రాత్రి 7గంటలకు తిరిగి బెంగళూరుకు వస్తారు.

● ముఖ్యమంత్రి పదవి లక్ష్యంగా పెట్టుకున్న డీసీఎం డీకే శివకుమార్, రెండున్నరేళ్ల పాలన దాకా అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తూ వచ్చారు. ప్రస్తుతం గడువు ముగుస్తుండడంతో అంత సులువుగా వదులుకుంటారని చెప్పలేం. ఢిల్లీలో శనివారం మీడియా అడిగిన ప్రశ్నకు మంత్రివర్గ విస్తరణ అంశమే తెలియదని దాటవేశారు. ఇతర ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా దాటవేశారు. దీన్నిబట్టి డీకే శివకుమార్ ముభావంగా ఉన్నారనేది తేటతెల్లమవుతోంది. క్యాబినెట్ విస్తరణకు అవకాశం లభించిందని భావిస్తున్నా తొలగించాల్సింది సీనియర్ మంత్రులనే కావడంతో ఎటువంటి పరిణామాలు దారి తీస్తాయోనని ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని అధిస్థానం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం తొలగింపుల జాబితాలో దినేశ్ గుండూరావు, ఎన్ఎస్ బోసరాజు, డీ సుధాకర్, రహీంఖాన్, శివానందపాటిల్, కేహెచ్ మునియప్ప, హెచ్‌సీ మహదేవప్ప, శరణబసప్ప దర్శనాపుర, ఎంసీ సుధాకర్, ఎస్ఎస్ మల్లికార్జున, ఆర్‌బీ తిమ్మాపుర, కే వెంకటేశ్‌లు ఉన్నారు. వీరిలో మహదేవప్ప, వెంకటేశ్‌లు సీఎం సొంత జిల్లావాసులే కాకుండా అత్యంత ఆప్తులు. వారిని తొలగిస్తారా..? అనేది సర్వత్రా కుతూహలం అవుతోంది.

● ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీసుకునే నిర్ణయం కీలకం కానుంది. సాధారణంగా ఎటువంటి అంశాలైనా తీర్మానించేముందు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలు నిర్ణయం తీసుకుంటారు. కానీ కర్ణాటక విషయంలో రాహుల్‌గాంధీ సూచన పాటించేదే అయినా పలు తిరకాసులు ఉండడంతో ఖర్గే ఏ విధంగా సమన్వయపరుస్తారనేది కుతూహలం అవుతోంది.

బ్యాంకు మేనేజర్‌పై హనీట్రాప్

● మహిళ కుమారుడితో సహా నలుగురుని అరెస్ట్ చేసిన పోలీసులు

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి బోండాలు విక్రయించే మహిళ సన్నిహితంగా మాటలు కలిపి ఏకంగా బ్యాంకు మేనేజర్‌ను హనీట్రాప్‌నకు గురిచేసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. విజయపుర జిల్లా ఇండి పట్టణం డీఎస్పీ కార్యాలయం పక్కన ఫుట్‌పాత్‌పై కొబ్బరిబోండాలను ఒక మహిళ విక్రయించేది. ఇండి తాలూకా అంజుటగి గ్రామానికి చెందిన ఇండియా బ్యాంకు మేనేజర్ ప్రతాప్ తరచూ కొబ్బరిబోండాలు కొనుగోలు చేయడంతో పరిచయం పెరిగింది. ఈనెల 1న సదరు మహిళ తన స్నేహితురాలి ఇంటికి మేనేజర్‌ను తీసుకెళ్లి సన్నిహితంగా గడిపారు. అనంతరం ఈనెల 5న మేనేజర్‌కు ఫోన్ చేసిన ఆమె మన ప్రైవేట్ వ్యవహారం ఒకరు వీడియో తీసి బెదరిస్తున్నారని చెప్పింది. ఆ తర్వాత మేనేజర్‌కు యూట్యూబర్ మహేశ్, హోం గార్డ్ తౌసిఫ్ ఖరోషిలు ఫోన్ చేసి రూ.10లక్షలు డిమాండ్ చేశారు. వీరికి సదరు మహిళ కుమారుడు అమూల్ హంసూర కూడా భాగస్వామ్యం అయ్యాడు. తరచూ ఫోన్ చేసి వేధించేవారు. డబ్బు ఇవ్వాల్సిందేనని పట్టు బట్టారు. వీరినుంచి ఒత్తిడి పెరగడంతో బ్యాంకు మేనేజర్ ఈనెల 12న ఇండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హనీట్రాప్ కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. మహిళతోపాటు ఆమెకు సహకరించినవారిని శనివారం అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ లక్ష్మణ నింబరగి తెలిపారు.

ఉత్పత్తిదారులే కాదు.. ఉపాధి సృష్టిస్తారు

● రైతుల కష్టం అందరూ గ్రహించాలి: మంత్రి చలువరాయ



రైతు సంఘం నాయకులు, పురస్కార గ్రహీతలతో మంత్రులు చలువరాయస్వామి, కృష్ణభైరేగౌడ

బెంగళూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): రైతులు కేవలం పంట ఉత్పత్తిదారులు కాదని ఉపాధి సృష్టించేగొప్ప పారిశ్రామికవేత్తలని వ్యవసాయశాఖ మంత్రి చలువరాయస్వామి అన్నారు. ఆదివారం కృషిమేళా ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశీయ వంగడాలు-సాగు పద్ధతులు అనే అంశంపై చర్చాగోష్ఠితో కృషిమేళాకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రి మాట్లాడుతూ వేలాదిమంది రైతులు వారు సాగు చేసే పంటలకు సంబంధించిన సందేహాలను వ్యవసాయశాస్త్రవేత్తలతో నివృత్తి చేసుకున్నారన్నారు. శాస్త్రవేత్తలు నాలుగురోజులపాటు సలహాలు ఇవ్వడంతోపాటు నూతన వంగడాలు, ఆధునికయంత్రాల గురించి చైతన్యం కలిగించారన్నారు. సాలుమరద తిమ్మక్క సాధనను నేటి విద్యార్థులు, యువత స్మరించుకోవాలన్నారు. అక్షరం రాకున్నా అత్యంత గౌరవమైన పద్మశ్రీ పురస్కారం పొందారన్నారు. రెవెన్యూమంత్రి కృష్ణభైరేగౌడ మాట్లాడుతూ కృషిమేళా ఓ కార్యక్రమం కాదని, ఓ విజ్ఞాన జాతర అన్నారు. రైతులు సంతోషంతో మేళాకు వచ్చారన్నారు. మహిళల భాగస్వామ్యం సంతోషం కలుగుతోందన్నారు. శాస్త్రవేత్తల మార్గదర్శకాలు మేళాకు కొత్త శక్తిని ఇచ్చాయన్నారు. 750 స్టాల్స్ ద్వారా ఎన్నెన్నో కొత్త అనుభవాలు పంచారన్నారు. ఉత్తమరైతులకు ప్రశంసాపత్రాలు అందచేసి ప్రత్యేకంగా సత్కరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ ఎస్‌వీ సురేశా, ఎక్స్‌టెన్షన్ డైరెక్టర్ వైఎన్ శివలింగయ్య, రిజిస్ట్రార్ కేసీ నారాయణస్వామి, పరిశోధనా విభాగం డైరెక్టర్ హెచ్ఎస్ శివరాంతోపాటు పలువురు పాల్గొన్నారు. నాలుగురోజుల వ్యవధిలో 54 లక్షలమంది సందర్శించారు. 55వేలమంది భోజనం చేశారు. రూ.5.17 కోట్ల లావాదేవీలు జరిగాయి.



ఎద్దులతో వీసీ సురేశా

దంపతుల ఆత్మహత్య



శ్రుతి, అమరేష్ (ఫైల్)

బళ్లారి రూరల్/కంప్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా టెక్కలకోట సమీపంలో మన్నూరు సూగూరు పెద్దరాజు క్యాంపులో ఆదివారం దంపతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉదయం భర్త అమరేష్ (24), భార్య శ్రుతి (20)ఇంట్లోనే ఉరి వేసుకున్నారు. దంపతుల మధ్య వివాదం కారణంగా ఈ ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లడంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు సిరిగేరి పోలీసులు తెలిపారు. దీనిపై కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శశిధర్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. దంపతుల మృతదేహాలను కంప్లి ఆస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా రాగిముద్ద ఆరగింపు పోటీలు

- వివరాలు 7లో



పథసంచలనంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు



దేశభక్తుల వేషధారణలో..





భరతమాత చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

భరతమాతకు వందనం

● ఘనంగా ఆర్ఎస్ఎస్ వందేళ్ల సంబరం.. ఉత్సాహంగా పథసంచలనం

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లా చిత్తాపురలో ఆర్ఎస్ఎస్ పథసంచలనం ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఆర్ఎస్ఎస్ 100 ఏళ్ల సందర్భంగా అక్టోబరులో పథసంచలనం నిర్వహించేందుకు సిద్ధం కాగా.. వివిధ సంఘాలు అదేరోజున ర్యాలీ చేయాలనుకోవడంతో వివాదమైంది. జాతీయస్థాయిలో చర్చకు కారణమైంది. హైకోర్టు అనుమతులతో ఆదివారం మధ్యాహ్నం 3.45 గంటలకు చిత్తాపురలో పథసంచలనం జరిగింది. బజాజ్ కల్యాణమండపం నుంచి ప్రత్యేక వేషధారణలో ఊరేగింపు ప్రారంభించారు. భారత్‌మాతాకీ జై, వందేమాతరం, జైశ్రీరామ్ నినాదాలతో కదిలింది. రోడ్డు పొడవునా ఊరేగింపుగా వెళ్తున్నవారిపై పూలుచల్లి భారత్‌మాతాకీ జై అంటూ ప్రజలు నినాదాలు చేశారు. వెయ్యిమందికి పైగా పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. 300 మంది ప్రత్యేక వేషధారణలో ర్యాలీలో పాల్గొనగా 50మంది వాయిద్యాలతో జాతీయగీతాల ఆలాపన చేశారు. జైభవాని, జై శివాజీ నినాదాలు కొనసాగాయి.

నేటి నుంచి బసవనగుడిలో శనక్కాయల పరుష

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో జరిగే ప్రతిష్ఠాత్మకమైన సంబరాల్లో ఒకటైన శనక్కాయల పరుషకు బసవనగుడి సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం దొడ్డబసవణ్ణ ఆలయం ప్రాంగణంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. ప్రాచీనకాల చరిత్రకు అనుగుణంగా బసవణ్ణ విగ్రహానికి శనక్కాయలతో తులాభారం జరపడం ద్వారా పరుషకు శ్రీకారం చుడతారు. తమిళనాడు, కర్ణాటకలోని వివిధ ప్రాంతాలనుంచి వేరశనక్కాయలను తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తారు. ఇదో జాతర తరహాలో కొనసాగుతుంది. ఈ ఏడాది ఐదురోజులపాటు శనక్కాయల పరుష కొనసాగించాలని నిర్ణయించారు. దొడ్డగణపతి ఆలయాన్ని పరుషకోసం ప్రత్యేకంగా అలంకరించారు. ఆరేడు రకాల శనక్కాయలను ఇక్కడ విక్రయిస్తారు. ప్రజలు ఆదివారం నుంచే పోటెత్తారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.61	1631.08
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,987	3,269
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,211	8,007
నీటి నిల్వ (టీఎంసీలు)	75.23	98.18

సంప్రదాయాలను మరువరాదు

● కమ్మసంఘం సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం : కార్తీక వనభోజనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం



కమ్మభవన్ భూమిపూజలో ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం, మునిరత్నం



హాజరైన సభ్యులు

కంప్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ దేశ సాంప్రదాయాలను మరువరాదని సండూరు నియోజకవర్గం ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం అన్నారు. జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో కమ్మ సంఘం కార్తీక వనభోజనాలు సందర్భంగా ఏర్పాటు చేసి కార్యక్రమంలో పాల్గొని ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాలుగా వ్యవసాయ రంగంలో రాణిస్తూ గుర్తింపు పొందింది. కమ్మసమాజమేనన్నారు. ఈ సమాజం భూమిని నమ్ముకున్న రైతుగా ప్రత్యేకంగా పేరు గాంచారన్నారు. ఈ కార్తీకమాసంలో వన భోజనాలు పేరుతో సమాజంలోని పిల్లలను, పెద్దలను అందరినీ ఒక చోటకి చేర్చి ధార్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకోవడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతమైన జీవనం కొనసాగించ వచ్చని తెలిపారు. కమ్మభవన్ ఏర్పాటుకు తమ వంతుగా ఒక్క కోటి రూపాయలు మంజూరు చేస్తామన్నారు. ఈ సమాజం ఎంపీ ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో గెలుపుకి ఎంతో కృషి చేశారని తెలిపారు. రాబోయే రోజుల్లో కుడితిని, కురుగోడు వెళ్లే రోడ్డు మార్గంలో రైల్వేట్రాక్ పైన జరుగనున్న ఫ్లైఓవర్ పనులు త్వరగా పూర్తి చేసి త్వరలోనే ఎంపీ తుకారాం ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తామన్నారు. అనంతరం రాంనగర్(ఆర్‌ఆర్‌నగర్) నియోజకవర్గ ఎమ్మెల్యే మునిరత్నం మాట్లాడుతూ కష్టాన్ని నమ్ముకుని జీవనం కొనసాగించేవారు ఎప్పుడు తలెత్తుకుని జీవితం కొనసాగిస్తారన్నారు. సమాజంలో ఐక్యత ఉన్నప్పుడే సమాజ అభివృద్ధి చెందుతుందన్నారు. బళ్లారి జిల్లాలో కమ్మసమాజం రానున్న రోజుల్లో మరింత గుర్తింపు పొందుతుందన్నారు. రాష్ట్రంలో తమ నాయకులతో చర్చలు జరిపి కమ్మ కార్పొరేషన్ అయ్యేందుకు కూడా తమ కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కుడితిని కమ్మ సంఘం అధ్యక్షులు వి రాము మాట్లాడుతూ కుడితిని పట్టణంలో నూతనంగా కమ్మభవనం ఏర్పాటు చేసేందుకు సమాజంలో అందరూ ముందుకు రావడంతో రూ. 5.50 కోట్ల వ్యయంతో భవనంగా ఏర్పాటు చేయాలని సిద్ధం చేశారన్నారు. ఈ భవనం ఏర్పడటం వల్ల కుడితిని చుట్టుపక్కల పేదకుటుంబాల వారికి అనుగుణంగా అవుతుందన్నారు. కంప్లి, సండూరు, హోస్పేట, గంగావతి, సిరుగుప్ప, బళ్లారి, కురుగోడు, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుండి కమ్మ సమాజం ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షురాలు సుజాత, సత్యప్ప సమితి అధ్యక్షులు రాజశేఖర్, కమ్మసమాజం అధ్యక్షుడు వి రాముప్రసాద్, ఉపాధ్యక్షులు ఆదెప్ప, గౌరవాధ్యక్షులు వెంకటరామప్ప, కార్యదర్శి సురేష్, నాగరాజు కోనంకి రామప్ప, కేఎస్ఎల్ స్వామి, రాజేంద్రప్రసాద్, డాక్టర్ అరుణ, ఏకాంబరం, ఆశాలత, శ్రీనివాస రావు, ముల్లంగి నందీష్, కోటేశ్వరరావు, రాజేశ్వరి, విక్కీ చంద్రయ్య దొడ్డ బసప్ప, చంద్రప్ప, రామాంజినేయులు సొసైటీ అధ్యక్షులు యర్రిస్వామి, కనికేరి పంపాపతి, వెంకట రమణ బాబు, కమ్మసమాజం ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు పట్టుబడిన దొంగ

● రూ.36 లక్షల ఆభరణాల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ

రాయచూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా మూడు ఇళ్లల్లో దొంగతనాలు చేసి కలకలం రేపిన దొంగ ఎట్టకేలకు ఆదివారం పోలీసుల చేతికి చిక్కాడు. ఈ ఏడాది మే 20న తిరిగి ఆగస్టు 29వ తేదీన మూడు ఇళ్లల్లో వరుసగా దొంగతనాలు జరగగా బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీని పై ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసిన జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య దొంగను గుర్తించడంలో జిల్లా పోలీసులు విజయం సాధించారని వివరించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయం వద్ద విలేఖరులతో మాట్లాడిన జిల్లా ఎస్పీ పుట్టమాదయ్య ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురంకు చెందిన గుజ్జల రామకృష్ణ అనే వ్యక్తి తరచు రైలులో ఇక్కడికి వస్తూ తాళం వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలు పాల్పడుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. పట్టుబడిన దొంగ నుంచి రూ.36.26లక్షల విలువగల 315 గ్రాముల ఆభరణాలను స్వాధీనం చేసుకుని న్యాయస్థానానికి అప్పగించినట్లు తెలిపారు. కాగా తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లె ఇళ్ల యజమానులు తగిన జాగ్రతలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. ఎవరైనా ఊళ్లకు వెళ్లినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

దేవదాసి వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత: జస్టిస్ విభుభఖ్రు

రాయచూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనాగరికమైన దేవదాసి వ్యవస్థను నిర్మూలించడం సమాజంలోని అందరి బాధ్యత అని కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవా ప్రాధికార ప్రధాన కార్యదర్శి జస్టిస్ విభుభఖ్రు అన్నారు. న్యాయసేవా ప్రాధికార ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నగరంలోని పండిత్ సిద్ధరామ్ జంబదిన్ని రంగమందిరంలో దేవదాసి నిర్మూలన నిషేధం వారి పునరావాసం అంశాల పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి జస్టిస్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో దేవదాసి పద్ధతి ఆచరణలో ఉండగా వాటి నిర్మూలన కోసం ఇప్పటికి ప్రభుత్వాలు తగిన చట్టాలను రూపొందించినట్లు తెలిపారు. దేవదాసి నిషేద చట్టం-1982తో పాటు కర్ణాటక దేవదాసి పద్ధతిను నివారించేందుకు 2025లోను వారి పునరావాసానికి సంబంధించి కొత్త చట్టాన్ని రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మాట్లాడిన హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ శుక్రె కమల్, పాత కాలంలో ఉన్న దేవదాసి పద్ధతికి ప్రస్తుతం సమాజంలో నడుస్తున్న దేవదాసి పద్ధతికి ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. నేటి ఆధునిక సమాజంలో దేవదాసి పద్ధతికి తావు లేదని ఈ విషయంలో మహిళలు స్వయం ప్రేరితులుగా తమను తాము చైతన్యవంతం కావాలన్నారు. దీంతో పాటు ప్రభుత్వ పరంగా అందుతున్న ప్రోత్సహకాల పై అవగాన పెంచుకుని తగిన రీతిలో లబ్ది పొందాలని సూచించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విభు భఖ్రు

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ప్రపంచ మధుమేహ దినోత్సవంలో డాక్టర్ సత్తార్



ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సత్తార్

కంప్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పట్టణాల్లో సంఘ సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సత్తార్ తెలిపారు. ప్రపంచ మధుమేహ దినోత్సవంలో భాగంగా గంగావతిలో ఐఎంఏ హాలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రఖ్యాత వైద్యుడు, రాజ్యోత్సవ అవార్డు గ్రహీత హుబ్బళ్లికి చెందిన డాక్టర్ జి సత్తార్ పాల్గొని రోగులకు చికిత్స కల్పిస్తూ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ఉచిత డయాబెటిస్ చెకప్ చేపట్టారు. కార్యక్రమాన్ని జిల్లా అదనపు సెషన్స్ జడ్జి సదానందనాయక్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇలాంటి శిబిరాల వల్ల ఎంతోమంది పేద కుటుంబాల వారికి అనుకూలం అవుతుందని తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మల్లన్నగౌడ పాటిల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ శివ కుమార్ మాలి పాటిల్ డాక్టర్ చంద్రప్ప, డాక్టర్ సోమరాజు, డాక్టర్ మల్లన్న గౌడ, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ సతీష్ రాయ్కర్, డాక్టర్ విజయగౌడ, డాక్టర్ మగ్దల్, డాక్టర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శికి సన్మానం



సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

బళ్లారిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక కార్యనిరంతర పత్రికర్తల సంఘం రాష్ట్ర కార్యదర్శి సమితి సభ్యులు బసవరాజును ఆదివారం అభిమానులు ఘనంగా సత్కరించారు. రవి, హనుమేష్, విశాంత్, పుట్టు మల్లికార్జున, గురురాజ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



విద్యార్థులతో బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

బళ్లారిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర సమీపంలోని బాదనట్టి ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులకు పరీక్షలకు అవసరమైన పెన్నులు, పుస్తకాల పరీక్ష ప్యాడ్లు, ఇతర సామాగ్రి బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ ఎస్ లింగప్ప మాట్లాడుతూ మన బాల్యంలో విద్యకు పెద్దగా సౌకర్యాలు వుండేవి కావు మనం కష్టపడి చదవాల్సి వచ్చేది కానీ నేటి పిల్లలు అన్ని సౌకర్యాలు కల్పించినప్పటికీ మొబైల్ ఫోన్లకు బానిసరిలో ఇవ్వడం వారు ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని బాగా ప్రాక్టీస్ చేయాలని ఆయన విద్యార్థులకు విద్య పట్ల పలు విషయాలు తెలిపారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ నేటి విద్య ప్రాముఖ్యత వివరిస్తూ నేటి తరానికి విద్య చాలా స్ఫూర్తిగా వుంటుందని ప్రతి ఒక్క విద్యార్థి మంచిగా చదివి పైకి ఎదగాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్ నాగేంద్ర, గురు శంకర్, వన్నూరుస్వామి, హుస్సేనప్ప, వసంత్‌కుమార్, జగదీష్, లక్ష్మన్న, రాజేశ్వరి, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు మొబైల్ వాడకాన్ని తగ్గించాలి

● పరీక్షల వేళ సమయం వృథా చేయరాదు: సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దయ్య



మొక్కకు నీరు పోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ సిద్దయ్య

సిరుగుప్ప నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మొబైల్ ఫోన్లను వాడటాన్ని నియంత్రించాలని తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దయ్య సూచించారు. ఆదివారం సిరుగుప్ప తాలుకాలోని టెక్కలకోట పట్టణంలో మాంటిస్సోరి పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాన్ని మొక్కలకు నీరు పోయడం ద్వారా సిద్దయ్య ప్రారంభించారు. నేటి రోజుల్లో పిల్లలు మొబైల్‌ను వాడటం అలవాటు చేసుకోవడం వలన విద్యపై ఆసక్తి తగ్గిపోతుందని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల భవిష్యత్తు కోసం అలవాట్లను మార్చుకోవాలన్నారు. పిల్లలు ఎక్కువగా పెద్దలను గమనిస్తుంటారన్నారు. వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టణ పంచాయతీ అధ్యక్షుడు ఆనంద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ జాతాకు సంపూర్ణ మద్దతు: విజయరాణి



విలేకరులతో మాట్లాడుతున్న ఐక్య సంఘాల వేదిక అధ్యక్షురాలు విజయరాణి

రాయచూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ రక్షణ జాగృతి కోసం ఈ నెల 18న నిర్వహించతలపెట్టిన అవగాహన జాతాకు తాము పూర్తిగా పద్దతునిస్తున్నట్లు మహిళ సంఘాల ఐక్య వేదిక అధ్యక్షురాలు విజయరాణి సిరవార తెలిపారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మహిళలకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కుల పై అవగాహన పెంచుకోవాలని కోరారు.

నాసిరకం పనులపై స్థానికుల ఆగ్రహం



నాసిరకం పైపులతో రోడ్డుపైనే పారుతున్న నీరు

సిరుగుప్ప నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తాగునీటి పైపులైన్ ఏర్పాటులో నాసిరకంగా పనులు చేశారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. సిరుగుప్ప పట్టణంలో 2.0 పథకం కింద నూతనంగా తాగునీటి పైపులైన్ పనులు జరుగుతున్నాయి. బళ్లారి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీటి సరఫరా పథకం కింద ఈ పనులు జరుగనున్నాయి. కాంట్రాక్టర్లు పైపులైన్ ఏర్పాటు చేసిన అనంతరం గుంతలు పడిన చోట కాంక్రీట్ వేయాల్సి వుంది. నెలల గడిచినా అలాగే వదిలేయడంతో ప్రజలు వాహనాలు తిరగడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరప్రజలు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. తక్షణమే ఈ విషయంపై దృష్టిసారించి జిల్లా అధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హోసూరు జోన్



సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

అన్నాడీఎంకే బూత్ ఏజెంట్ల సమావేశం

హోసూరు నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హోసూరులోని అన్నాడీఎంకే కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యాలయంలో ఆదివారం బూత్ కమిటీ ఏజెంట్ల సమావేశం జరిగింది. మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పన్నీర్‌సెల్వం పాల్గొని పార్టీ సభ్యులకు వివిధ సూచనలు అందించారు. హోసూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 3.80 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, వీరిలో 18 శాతం ఓట్లు మిస్ అవుతున్నాయన్నారు. అందుకే ఎస్ఐ ఆర్ విధానంలో నకిలీ ఓటర్లను తొలగిస్తున్నారు. సర్వే ముమ్మరంగా సాగుతోందన్నారు. సమావేశంలో నిర్వాహకులు వాసుదేవన్, నారాయణన్, శ్రీనివాసన్, అశోక్‌రెడ్డి, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర తగ్గిన టమోటా

హోసూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హోసూరు, బాగలూరు, బేరికై, శూలగిరి, ఉద్దన్నపల్లి ప్రాంతాలలో 4వేలకు టమోటా సాగు చేశారు. ఇక్కడి పంటను చెన్నైలోని కోయంబేడు మార్కెట్, ఈరోడ్, కోయంబత్తూర్, కేరళ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. గత ఏడాది కిలో టమోటా రూ.100 పలకగా ఈసారి ఫస్ట్‌గ్రేడ్ టమోటా రూ.35-45 పలుకుతోంది. రెండో గ్రేడ్ టమోటా కిలో రూ.15 ఉంటోంది. గతంతో పోలిస్తే ఈసారి టమోటా నాణ్యతకు, ధరకు సంబంధం లేని రీతిలో ఉందని రైతులు వాపోతున్నారు.

అడవిపందుల నుంచి రక్షణకు
పంటలకు పరదాలు



పంటలకు పరదాలు ఏర్పాటు చేసిన రైతులు

హోసూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లలోని అంచెట్టి, డెంకణీకోట , ఉరిగం, కొట్టయూర్ ప్రాంతాలలో వేరుశనగ, నువ్వులు వంటివి సాగు చేస్తున్నారు. ఇక్కడి ఇక్కడ పండించే వేరుశనగ అధిక నాణ్యతతోపాటు అధిక దిగుబడి ఉండడంతో మార్కెట్‌లో మంచి ధర పలుకుతోంది. ఈనెల చివరన కోత ప్రారంభం కానుంది. అడవి పందులనుంచి పంటలు రక్షించేందుకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడవిపందుల బారినుంచి రక్షించుకునేందుకు పొలాల చుట్టూ కందకాలు తవ్వడం, చీరలతో పరదాలు నిర్మించడం, చెట్ల కొమ్మలతో కంచెలు ఏర్పాటు చేయడం వంటివి చేస్తున్నారు. అయినా అడవి పందుల సమస్య ఉంది. అడవిపందుల దాడులనుంచి రక్షించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రైతు నంజప్ప మాట్లాడుతూ కెలమంగలం, డెంకణీకోట, అంచెట్టి, ఉరిగం, కొట్టయూర్ ప్రాంతాల వర్షాధారిత పంటలు పండిస్తున్నారన్నారు. సారవంతమైన భూమి కావడంతో వేరుశనగ మంచి నాణ్యత, రుచికరంగా ఉండడంతో వ్యాపారులు వచ్చి వాటిని నేరుగా కొనుగోలు చేస్తారన్నారు. అయితే అడవి పందులు, ఏనుగుల దాడుల వల్ల పంటలను రక్షించుకోవడం సవాల్‌గా ఉందన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

యోగాలో రాణిస్తున్న పూజ

● చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో రాణింపు



అవార్డులతో పూజ



యోగా విన్యాసం చేస్తున్న పూజ

కంప్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యోగాలో నైపుణ్యం కలిగిన ఎస్ పూజ పిట్ట కొంచెం కూత ఘనంలా ఖ్యాతి పొందుతోంది. చిన్న వయస్సులోనే ఎన్నో అవార్డులు సాధిస్తూ ప్రతిభ చాటుతోంది. కంప్లిలోని 16వ వార్డులో నివసిస్తున్న ఎస్ శివలింగమ్మ యమనప్ప దంపతుల రెండవ సంతానం సుపత్రి పూజ అనే విద్యార్థి వయస్సులో చిన్న అయినా పెద్దల మన్ననలు పొందుతోంది. ఇంట్లో పేదరికం ఉన్నప్పటికీ సంకల్ప శక్తితో పాఠశాల అభ్యాస దశలో మొదటిస్థానంలో ఉన్నప్పటికీ యోగాతో సహా ఇతర రంగాలలో తనకంటూ ఒక స్థానాన్ని కలిగి వుండాలనే కోరికతో ఆమె సాధన నిచ్చెనను అధిరోహిస్తోంది. హోస్పేటలోని ఏపీజే అబ్దుల్ కలాం, మొరార్జీ దేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతోంది. ఇక్కడ చదువుతో పాటు ఆమె యోగాలో తనదైన ముద్ర వేసింది. 2022లోబళ్లారి నగరంలో యువజన సాధికారత, క్రీడా శాఖ నిర్వహించిన యోగా పోటీలలో మొదటిస్థానం గెలుచుకోవడం ద్వారా ఆమె విజయాల పతాకం వేసింది. ఆ తరువాత 2023లో కల్బుర్గి డివిజనల్ స్థాయి దసరా స్పోర్ట్స్ మీట్‌లో యోగాలో మొదటి స్థానాన్ని సాధించింది. 2025 మైసూరు దసరా స్పోర్ట్స్ మీట్‌లో యోగాలో ప్రత్యేకమైన విజయంతో ఆమె రాష్ట్రస్థాయిలో కీర్తి పతాకాన్ని ఎగురవేసింది. ఈ విధంగా రాష్ట్రస్థాయిలో అనేక విజయాలను వ్యాప్తి చేసిన ఘనత పూజ సొంతం చేసుకుంది.

యోగాభ్యాసం ప్రారంభం

పూజ జూన్ 2022లో కంప్లి నగరంలోని యక్ష యోగా అకాడమీలో చేరారు. వ్యవస్థాపకురాలు ఎం శ్యామలమ్మ శిక్షణ, మార్గదర్శకత్వంలో రోజు రోజుకు యోగా సాధన చేస్తూ చిన్న వయసులోనే సాధించడానికి ప్రేరణ పొందింది. కంప్లిలో జరిగిన అనేక పోటీలలో ఆమె సాధించిన విజయాలకు ఆమె మొదటి అడుగు నుండే అవార్డులను గెలుచుకుంది. తరువాత ఆమె గడినాడు కణ్మణి అవార్డు, సాధక రత్న అవార్డు, కంప్లి కళారతి అవార్డు మొదలైన అనేక అవార్డులను గెలుచుకుంది.


ఇతర రంగాల్లో..

యోగా విజయాలతో పాటు ఆమె జాతీయ రాష్ట్రస్థాయి అబాకస్‌లో ఛాంపియన్‌షిప్ అవార్డు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలలో సోలో పాత్రకు అవార్డులు తాలుకా కన్నడ సాహిత్య పరిషత్ కంప్లి కళారతి ఉత్సవ్‌లను కూడా గెలుచుకుంది. గాయత్రి యోగా అందించే అభినందన్ అవార్డు వంటి అవార్డులు, అనేక సంస్థల నుండి బంగారు, వెండి పతకాలు పూజ ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. ఆమెను మరింత సాధించడానికి ప్రేరేపించాయి. తల్లిదండ్రులు శివలింగమ్మ యమనప్ప మాట్లాడుతూ నేటి పోటీయుగంలో సాధించడం అంత సులభం కాదు. అటువంటి పరిస్థితిలో మా కుమార్తె పూజ యోగాలో రాష్ట్రస్థాయిలో ఒక అడుగు సాధించడం గర్వకారణం. పిల్లలు విద్య, యోగాతో సహా ప్రతి రంగంలో సాధించినప్పుడు వారు భవిష్యత్తులో మంచి భవిష్యత్తును నిర్మించుకోగలరు. ఈ విషయంలో ముందుకు సాగడానికి మేము అన్ని విధాలుగా సహకారాన్ని అందిస్తామన్నారు. పూజ మాట్లాడుతూ యోగా పోటీలో విజయం సాధించడం, ప్రతి దశలోనూ యక్ష, యోగా అకాడమీ వ్యవస్థాపకురాలు, గురువు శ్యామలమ్మ తల్లిదండ్రుల సహకారంతో అవార్డును గెలుచుకోవడం సాధ్యమైందని తెలిపారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

కావ్యకంఠ గణపతి ముని (జయంతి)



కావ్యకంఠ గణపతి మునిగా పేరొందిన అయ్యల సోమ యాజులు గణపతి శాస్త్రి 1878 నవంబరు 17న బొబ్బిలి ప్రాంతం కలవరాయి అగ్రహారంలో జన్మించారు. రమణ మహర్షి శిష్యులలో ప్రముఖుడైన ఆయన పండితుడు, జ్యోతిష్యుడు, ఆధ్యాత్మిక వేత్తగాను రాణించారు. తెలుగు పండితుడిగా, అధ్యాపకులుగా పనిచేశారు. పదో యేటనే తెలుగు, సంస్కృత భాషలందు, వేదములు, తర్కం, గణితం, జ్యోతిష్యం, ఆయుర్వేదములో అసమాన ప్రతిభ చూపారు. వివిధ ప్రదేశాలలో తపస్సు ఆచరించి మంత్రసిద్ధి పొందారు. పలు దేవుడి స్తోత్రాలను రచించారు. 1936 జూలై 25న నిర్యాణము చెందారు.

జెమినీ గణేశన్ (జయంతి)



తమిళ సినీరంగంలో వెండితెరపై జెమినీ గణేశన్‌గా పేరొందిన రామస్వామి గణేశన్ 1920 నవంబరు 17న తమిళనాడులోని పుదుక్కోట్టై ప్రాంతంలో జన్మించారు. రొమాంటిక్ పాత్రలతో 'కాదల్ మన్నన్'గా అభిమానులచే పిలువబడ్డారు. తెలుగు, హిందీ భాషల సినిమాలలోనూ నటించారు. పద్మశ్రీ, కలైమామణి తదితర పురస్కారాలు పొందారు. మహానటి సావిత్రిని పెళ్ళాడారు. ఆయన 2005 మార్చి 22న తుదిశ్వాస వీడడంతో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి.

లాలా లజపత్‌రాయ్ (వర్ధంతి)



'పంజాబ్ కేసరి'గా పేరొందిన లాలా లజపత్‌రాయ్ 1865 జనవరి 28న పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్‌పురిలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధుడు. లాల్, బాల్ (బాలగంగాధర తిలక్), పాల్ (బిపిన్ చంద్ర పాల్) త్రయంలో ఆయన ప్రథములు. సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించి సైమన్ గో బ్యాక్ నినాదం చేశారు. పత్రికలను ప్రోత్సహించడం ద్వారా ప్రజా చైతన్యం తెచ్చారు. కాంగ్రెస్ పార్టీలోనూ కీలకంగా వ్యవహరించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్, లక్ష్మీ ఇన్సూరెన్స్ సంస్థల సంస్థాపకుడు. పోలీసు దాడులలో గాయపడి చివరకు 1928 నవంబరు 17న కన్నుమూశారు.

బాల్ ఠాక్రే (వర్ధంతి)



శివసేన పార్టీ వ్యవస్థాపకుడైన బాల్ ఠాక్రే (థాకరే) 1926 జనవరి 23న పూనేలో జన్మించారు. మరాఠీల ఆరాధ్యదైవం. రాజకీయ వ్యంగ్య చిత్రకారుడిగా జీవనం ఆరంభించి క్రమేపీ రాజకీయాల్లోకి వచ్చారు. హిందూత్వాను, హిందూ జాతీయవాదాన్ని బలపర్చాడు. దశాబ్దాలపాటు మహారాష్ట్ర రాజకీయాల్లోనే కాకుండా జాతీయ రాజకీయాలను సైతం ప్రభావితం చేసిన విలక్షణ వ్యక్తి. శివసేన అధికారంలోకి వచ్చినా ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2012 నవంబరు 17న కన్నుమూశారు. ఎలాంటి అధికార పదవిని చేపట్టని ఠాక్రేకు పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించగా 20లక్షలమందికిపైగా అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

డాక్టర్ వరప్రసాద రెడ్డి (పుట్టినరోజు)



కోడూరు ఈశ్వర వరప్రసాద రెడ్డి 1948 నవంబరు 17న నెల్లూరులో జన్మించారు. టీకాలు ఉత్పత్తి చేసే శాంత బయోటెక్నిక్స్ సంస్థాపకుడు. పారిశ్రామికవేత్త, శాస్త్రవేత్త. స్వదేశీ హెపటైటిస్ బి టీకాను ఉత్పత్తిచేసిన సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారు. 2005లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. గౌరవ డాక్టరేట్‌లు పొందారు. సాహిత్యం, కళలు, సంగీతంపై రచనలు చేశారు. ఎంఎస్ సుబ్బులక్ష్మి, ముళ్ళపూడి వెంకటరమణల ఆటోబయోగ్రఫీ రాశారు. యోగాను విస్తృతం చేయడానికి కృషి చేశారు.

ఘటం ఉడుప (పుట్టినరోజు)



ఘటం గిరిధర్ ఉడుప 1980 నవంబరు 17న జన్మించారు. ఘటం వాద్యకారులలో నిష్ణాతులు. లయ తరంగ సభ్యుడు. శాస్త్రీయ, జానపద సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. ఉడుప ఫౌండేషన్ ద్వారా సంగీతం, కళలను ప్రోత్సహిస్తున్నారు. కర్ణాటక సంగీతాన్ని ఘటంతోపాటు మృదంగం, ఖంజీర, మోర్చింగ్‌లతో ప్రదర్శించి సత్తా చాటుకున్నారు. కంచి కామకోటి పీఠం ఆస్థాన విద్వాన్, గాన కళా పరిషత్, నాదజ్యోతి పురస్కారంతోపాటు పలు గౌరవాలు అందుకున్నారు.

బాలికపై అత్యాచారం

బెంగళూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేద్దామని నమ్మబలికి బాలికను నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడిన సంఘటన బెంగళూరు మాదనాయకనహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం ఘటన చోటు చేసుకుంది. యతీశ్ (26) దారుణానికి పాల్పడినట్టు గుర్తించారు. ఫిర్యాదు మేరకు మాదనాయకనహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దండి

పావగడ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ప్రయోజకులు చేసినప్పుడే జీవితంలో ఆ కుటుంబం సంతోషంగా ఉంటుందని అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ఆదివారం తాలూకా పరిధిలోని నీలంపల్లి గ్రామంలో జరిగిన వాల్మీకి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీరామ్, గిరి, అక్కులప్ప, మారప్ప, నాగలక్ష్మీ, నిర్మల, వాల్మీకి నాయకులు పాల్గొని మాజీ ఎంపీని సన్మానించారు.

ఉత్సాహంగా రాగిముద్ద ఆరగింపు పోటీలు



విజేతలను అభినందిస్తున్న మంత్రి రామలింగారెడ్డి



పోటీలో పాల్గొన్నవారు

బొమ్మనహళ్ళి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): స్థానిక హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లో రాగిముద్ద-నాటుకోడి పులుసు ఆరగించే పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. మంత్రి రామలింగారెడ్డి పోటీలను లాంఛనంగా ప్రారంభించి మాట్లాడుతూ రాగిముద్ద క్రమం తప్పకుండా ఆరగించడం ద్వారా చక్కటి ఆరోగ్యం సాధ్యమన్నారు. మాజీ ప్రధాని దేవేగౌడ ఆరోగ్యానికి ఇదే రహస్యమన్నారు. రాగిముద్ద పోటీలపై అభినందించారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో గత ఏడాది నుంచి నిర్వహిస్తున్నారు. మైసూరు, చిక్కబళ్ళాపుర, కోలారు, తుమకూరు, మండ్య జిల్లాలకు చెందిన వారు పోటీల్లో పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. పురుషుల విభాగంలో వైట్‌ఫీల్డ్‌కు చెందిన అజయ్‌కుమార్, అత్తిబెలెకు చెందిన రమేశ్, కోలారుకు చెందిన యశ్వంత్‌లు వరుసగా విజేతలుగా నిలిచారు. మహిళల విభాగంలో సౌమ్య (వైట్‌ఫీల్డ్), చంద్రకళ (చిక్కనాయకనహళ్ళి), పుష్ప (యలహంక) విజేతలుగా నిలిచారు. మహిళా విభాగంలో ప్రథమ బహుమతి విజేతకు 32 ఇంచీల టీవీ, రూ.5వేలు నగదు, చీరలు అందచేశారు. పురుషులకు ప్రథమ బహుమతిగా పొట్టేలు, ద్వితీయ బహుమతిగా మేక, తృతీయ బహుమతిగా నాటుకోడి అందచేశారు. పోటీలకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్టు నిర్వాహకుడు అనిల్ తెలిపారు. రాగిముద్ద ఆహార ప్రాధాన్యతను తెలియచేయడమే పోటీల లక్ష్యమన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు వాసుదేవరెడ్డి, రవీంద్ర, జయరాంరెడ్డి, మాజీ కార్పొరేటర్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ పాఠశాలను ఆధునికీకరించడమే లక్ష్యం

» మీనాక్షి ఫౌండేషన్ అధ్యక్షుడు నరసింహమూర్తి



బెంచీలు, బ్యాగులు అందజేసిన ఫౌండేషన్ సభ్యులు

శిడ్లఘట్ట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హక్కిపిక్కి కాలనీ ప్రభుత్వ పాఠశాలను ఆధునీకరించడం లక్ష్యమని మీనాక్షి ఫౌండేషన్ అధ్యక్షుడు, సమాజసేవకులు బీరప్పనహళ్ళి గౌడర నరసింహమూర్తి పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలోనూ పాఠశాలలో తగిన సదుపాయాలు లేవని గుర్తించామని ఇలాంటి పాఠశాలను ఆధునీకరించాల్సి ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ కోసం రెండు స్క్రీన్‌లు ఏర్పాటు చేశామన్నారు. టేబుల్స్, బెంచీలు, బ్యాగులు సమకూర్చామన్నారు. విజన్‌నెట్ కంపెనీ ఇతర సంస్థల సహకారంతో అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నామన్నారు. మాదిరి పాఠశాలగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. రానున్నరోజుల్లో ప్రతి నెలా ఒక పాఠశాలను అభివృద్ధి చేసే లక్ష్యం ఉన్నట్టు తెలిపారు. డిసెంబరు 30న గంజగుంటె పాఠశాలకు సాయం చేయదలిచామన్నారు. విద్యతోనే సమాజ ప్రగతి అని ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి శ్రీమంతులు, పారిశ్రామికవేత్తలు, దాతలు సహకరించాలలన్నారు. కార్యక్రమంలో విజన్ నెట్‌కు చెందిన అనిల్ భరత్వాల్, బీరప్పనహళ్ళి ద్యావప్ప, ఎం కృష్ణ, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాహితీసేవలు అపారం

» తాలూకా శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు సురేశ్‌బాబు



వేదికపై ఉపాధ్యాయులు తదితరులు

విజయపుర, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కన్నడ సాహిత్యానికి, వచన సాహిత్యానికి, దాస సాహిత్యానికి, జానపద సాహితీవేత్తల సేవలు అపారమని దేవనహళ్ళి తాలూకా శరణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు సురేశ్‌బాబు పేర్కొన్నారు. పట్టణంలోని రోటరి హైస్కూల్ ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం, బాలల దినోత్సవం, కనకదాసజయంతి ఇలా మూడు కార్యక్రమాలను ఒకేసారి నిర్వహించారు. సురేశ్‌బాబు మాట్లాడుతూ కన్నడ సాహిత్యానిక 2వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నారు. ఇంతవరకు కన్నడకు ఎక్కువ జ్ఞానపీఠ పురస్కారాలు దక్కాయన్నారు. స్థానికులే కాకుండా రాష్ట్రంలో ఉంటున్న అందరూ కన్నడ భాషను గౌరవించి నేర్చుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రధానోపాధ్యాయురాలు మంజుళ, రోటరీ ఎడ్యుకేషన్ సంస్థ మాజీ అధ్యక్షుడు రుద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పణత్తూరు రోడ్డు విస్తరణలో ప్రగతి



పరిహారం చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

మహదేవపుర, బెంగళూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పణత్తూరు ఎస్ క్రాస్ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి ప్రగతి మరోదశకు చేరుకుంది. రోడ్డు విస్తరణకు సంబంధించి అవసరమైన భూసేకరణలో భాగంగా భూయజమానులకు నగదు పరిహార చెక్కులను ఎమ్మెల్యే మంజుళా పంపిణీ చేసి, పనులు ప్రగతిని సమీక్షించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు 2022 సెప్టెంబరులో రాష్ట్రప్రభుత్వం నగదు పరిహార విధానంపై భూసేకరణకు అనుమతి ఇవ్వగా 2023 ప్రారంభంలో నోటిఫికేషన్ విడుదలైందన్నారు. సమావేశంలో తహసీల్దార్ (భూసేకరణ) వసంత కుమారి, మేజర్ రోడ్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్, బీబీఎంపీ అధికారి కోదండరెడ్డి, బీజేపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, రాజేశ్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై కన్నడ తోరణాలు



కూడలిలో కిందపడిన కన్నడ తోరణం

చింతామణి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డులోని కూడలిలో కన్నడ తోరణం కిందపడి ఉండడంపై కేఆర్ఎస్ పార్టీ తాలూకా అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కన్నడ రాజ్యోత్సవం సందర్భంగా ప్రజలలో చైతన్యం కల్పించేలా పట్టణంలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో కన్నడ పతాకాలు, తోరణాలు అమర్చారు. రాజ్యోత్సవం ముగిసి రెండు వారాలు గడిచినా వాటిని తొలగించలేదని, కాగా కిందపడిన తోరణాలతో అగౌరవం పరిచేలా ఉండడమే కాక ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యాసామగ్రి అందజేత

శిడ్లఘట్ట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ద్యావప్పగుడి సమీపాన జయంతి గ్రామం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని లేఖనా సామగ్రి పంపిణీ చేశారు. టీచర్ మంగళ మాట్లాడుతూ 46మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఎగ్జామ్‌ప్యాడ్, ఇతరత్రా ఇచ్చామన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రామాంజినమ్మ, సుమిత్ర, చైత్ర తదితరులు పాల్గొన్నారు.



నోటు పుస్తకాలతో విద్యార్థులు

అలరించిన శునకాలు



ప్రదర్శనలో శునకాలు

బెంగళూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): పెట్-ఏ-థాన్ పేరిట రోటరీ బెంగళూరు ఐటీకారిడార్, ఇన్నర్‌వీల్ క్లబ్‌తోపాటు పలు సంస్థలు సంయుక్తంగా శునకాల ప్రదర్శన ఏర్పాటు చేశాయి. ఆదివారం సర్జాపుర రోడ్డు థేరపప్ రిసార్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 150మందికిపైగా శునకాలతో వచ్చారు. ఇదే సందర్భంగా పెట్ గ్రూమింగ్, వైద్య పరీక్షలతోపాటు కుక్కలను పెంచేవిధానం, వాటి ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వెటర్నరీ డాక్టర్‌లు, నిపుణులు సలహాలు ఇచ్చారు. డిసెంబరు 6న వైట్‌ఫీల్డ్‌లోని కేటీపీఓలో జరిగే 18వ విడత మిడ్‌నైట్ మారథాన్‌లో భాగంగా పెట్-ఏ-థాన్ నిర్వహించినట్టు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడి కన్నుమూత



నాగభూషణ్ (ఫైల్)

బెంగళూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు సీఆర్ నాగభూషణ్ (58) కన్నుమూశారు. విద్యాశాఖలో డీడీపీఐ హోదాలో పని చేస్తుండేవారు. ఉద్యోగసంఘాల సమావేశాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయన పార్థివదేహాన్ని శ్రీనివాసపుర తాలూకా రాయల్పాడుకు తరలించారు. ఆదివారం అంత్యక్రియలు జరిపారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగుల సంఘం ముఖ్యనేతలతోపాటు పలువురు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలమేళా

దొమ్మసంద్ర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర గ్రామీణ సమృద్ధి కేంద్రం, ఆనేకల్ జ్ఞానజ్యోతి సంస్థ ఆధ్వర్యంలో సెయింట్‌జోసెఫ్ స్కూల్‌లో బాలమేళా కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఇటుకల బట్టీలలో పనిచేసే వలస కార్మికుల పిల్లలు, కలికాకేంద్రానికి వచ్చే పిల్లలకోసం కార్యక్రమాన్ని చేపట్టారు. పలు రకాల ఆటలపోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆనేకల్ బీఈఓ గురుమూర్తి మాట్లాడుతూ పిల్లల్లోని ప్రతిభను వెలికితీసేలా కార్యక్రమాలు చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆనేకల్ తాలూకా ఆరోగ్యసముదాయ కేంద్రం వైద్యాధికారి నళిని మాట్లాడుతూ ఆటపాటల్లో పాల్గొనడం ద్వారా శారీ రక ధారుడ్యంతోపాటు ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలలో నృత్యాలు, నాటిక ప్రదర్శనలు సాగాయి. జ్ఞానజ్యోతి సంస్థల ముఖ్యులు ఫాదర్ కాంతరాజ్ నేతృత్వంలో బహుమతులు ప్రదానం చేశారు.



బాలమేళాలో బీఈఓ గురుమూర్తి తదితరులు

పర్యాటక స్వర్గం ఒడిశా



ఒడిశా డిప్యూటీ సీఎం ప్రవతి పరీదా తదితరులు

బెంగళూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): పర్యాటకులకు ఒడిశా ఆసక్తికరమైన ప్రాంతమని ఎన్నెన్నో కొత్త అనుభవాలను పొందవచ్చునని ఒడిశా డిప్యూటి సీఎం ప్రవతి పరీదా అభిప్రాయపడ్డారు. స్థానికంగా ఒడిశా పరబ్ పేరిట మూడు రోజుల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సంస్కృతి, చేతివృత్తులు, ఒడిశా వంటకాలను పరిచయం చేసేలా పర్యాటకశాఖ ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా డీసీఎం ప్రవతి పరీదా మాట్లాడుతూ ఒడిశా పరబ్ ద్వారా ప్రత్యేక సంస్కృతి మాత్రమే కాదని ప్రగతి, సృజనశీలతను పరిచయం చేస్తున్నామన్నారు. ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతశాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేశాయన్నారు. ఒడిశా పర్యాటక శాఖ మంత్రి బల్వంత్‌సింగ్‌తోపాటు ముఖ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదాస జయంతి



ప్రసంగిస్తున్న మంత్రి రామలింగారెడ్డి

బొమ్మనహళ్ళి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బీటీఎం లే అవుట్‌లోని కువెంపు పార్క్‌లో భక్త కనకదాస జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి, గ్యారెంటీ పథకాల కమిటీ అధ్యక్షుడు రేవణ్ణ ప్రారంభించారు. రామలింగారెడ్డి మాట్లాడుతూ కనకదాసు కేవలం కురుబ సామాజిక వర్గానికే కాకుండా సమాజంలో అందరి కోసం పాటుపడ్డారన్నారు. కీర్తనల ద్వారా సమాజాన్ని ఆయన చైతన్యం చేశారన్నారు. ఆయన ఆదర్శాలు నేటికీ అనుసరణీయమన్నారు. రేవణ్ణ కూడా ఇదే అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ప్రభుత్వం కూడా కనకదాస జయంతిని ఆచరిస్తోందన్నారు. ఇదే సందర్భంగా కన్నడ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు లింగరాజు నేతృత్వంలో కార్యక్రమం ఏర్పాటైంది. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మంజునాథ్, ఆడుగూడి మోహన్, మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

కురుడుమలెలో విశేష పూజలు



కురుడుమలె గణపతి

ముళబాగిలు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తాలూకాలో ప్రసిద్ధిచెందిన కురుడుమలె వినాయకుడికి ఆదివారం ప్రత్యేకపూజలు చేశారు. కార్తీక మాస పూజల్లో భాగంగా అభిషేకం, అలంకరణ నిర్వహించారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మగువలకు ఆభరణాలు అందం

బెంగళూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మగువలు ఆభరణాలతో మరింత అందంగా మారుతారని అయితే నమ్మకం కల్గినచోటునే కొనుగోలు చేయాలని ఇంద్రియా సంస్థ సీఈఓ సందీప్ కొహ్లి అభిప్రాయపడ్డారు. ఆదిత్యబిర్లా జ్యువెలరీ సంస్థ ఇంద్రియా నగరంలో రెండోశాఖను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా 38శాఖలు ఉన్నాయని దక్షిణాదిన మరిన్నిశాఖలు విస్తరింపచేయదలిచామన్నారు. ఆభరణాల ఎంపిక పట్ల కొత్త విధానాన్ని తీసుకొచ్చామన్నారు.